సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలు పంపిణీ చేస్తున్న అతిథులు

పెదగంట్యాడ: విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలంటే ముందు వాటిపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ జంధ్యాల రవీంద్రనాథ్, డాక్టర్ కొణపల విశ్వేశ్వరరావు అన్నారు. జంధ్యాల పాపయ్యశాస్త్రి జయంతిని పురస్కరించుకొని స్థానిక శాఖా గ్రంథాలయాన్ని సోమవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పాఠకులు, విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. అలాగే జంధ్యాల పాపయ్య శాస్త్రి రచించిన పుస్తకాలు పంపిణీ చేశారు. గ్రంథాలయాధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

‘ఉక్కు గుర్తింపు యూనియన్ ఎన్నికలు జరపాలి’

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల గుర్తింపు యూనియన్ ఎన్నికలు వెంటనే జరిపించాలని ఉక్కు శ్రామిక సంఘం ప్రధానకార్యదర్శి బొడ్డు పైడిరాజు కోరారు. ఈమేరకు ఆయన సోమవారం సెంట్రల్ లేబర్ కమిషనర్‌కు లేఖ రాశారు. గడువు ముగిసిన గుర్తింపు యూనియన్‌తో యాజమాన్యం కుమ్మక్కై ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. గుర్తింపు యూనియన్ ఎన్నికలు జరిగి మూడున్నరేళ్లు పూర్తయిందన్నారు. ఉక్కు యాజమాన్యం గుర్తింపు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించి మధ్యలో నిలిపి వేసిందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కరించే యూనియన్‌ను ఎన్నుకునేందుకు సెంట్రల్ లేబర్ కమిషనర్ గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించేలా ప్రాంతీయ లేబర్ కమిషనర్‌కు ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

కమ్యూనిటీ హాల్ ప్రారంభం



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

పెదగంట్యాడ: నియోజకవర్గంలోని అన్ని వార్డులను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు పరిధిలోని దయాల్‌నగర్ టీపీసీ పాయింట్ వద్ద రూ.17.70 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి , పల్లా రమణ, వియ్యపు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

14న బీచ్ రోడ్‌లో థ్యాంక్స్ గివింగ్ ర్యాలీ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఈ నెల 14న బీచ్ రోడ్‌లో థ్యాంక్స్ గివింగ్ ర్యాలీ ఏర్పాటు చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో హయ్యర్ పెన్షన్‌కు అర్హత పొందిన ఉద్యోగుల్లో దాదాపు 80 శాతం మంది హయ్యర్ పెన్షన్ పొందారు. మిగిలిన వారికి కూడా త్వరలో కొత్త పీపీవోలు జారీ చేస్తామని పీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో బీచ్ రోడ్డులో నిర్వహించనున్న ర్యాలీకి స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న భెల్ సీఐటీయూ నాయకులు

గాజువాక: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పని చేస్తున్న 5వేల మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించడం దారుణమని భెల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి. ప్రకాష్ అన్నారు. ఆ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న పోరాట పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టీల్ యాజమాన్యం, కూటమి ప్రభుత్వం కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యవర్గ సభ్యుడు జగన్నాథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చర్యలను ప్రజానీకం ఖండించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.నారపరెడ్డి, పి.కనకారావు, ఆర్.జనార్దనరావు, జి.అచ్చన్ననాయుడు, పి.శివరాం, ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ వాచ్





- మనిషి కదలికలన్నీ నిక్షిప్తం
- యువత చూపు స్మార్ట్ గడియారం వైపే..
- ఆరోగ్యంతో పాటు మరెన్నో ఫీచర్లు
- గుండె చప్పుడు లెక్కగట్టి కళ్లముందుంచుతున్న వాచ్
- పాతతరం గడియారాలపై తగ్గిన మోజు

గడియారం.. ఒకప్పుడు టైమ్ చూసుకోవడంతో పాటు తేదీలను తెలుసుకోవడానికి వినియోగించేవారు. ఇప్పుడు కాలం మారింది. సాంకేతిక విప్లవంలో భాగంగా గడియారాలు కూడా స్మార్ట్‌గా రూపాంతరం చెందాయి. మానవుడి కార్యకలాపాలన్నీ సాంకేతికతతో ముడిపడుతున్నాయి. దైనందిన జీవితంలో సాంకేతిక పరికరాలు కీలకంగా మారాయి. స్మార్ట్ వాచ్‌లోనే మొబైల్ ఫోన్ మాదిరిగా కాల్స్, మెసేజీలతో వాట్సప్ మెసేజ్‌లు కూడా వచ్చేస్తుండడంతో యువత స్మార్ట్ వాచ్‌లకు జై కొడుతున్నారు. ఈ స్మార్ట్ వాచ్‌లలో సెల్‌ఫోన్‌లోని ఫీచర్స్ కూడా ఉండడంతో యువత వాటిని కొనుగోలు చేస్తున్నారు.

– పెదగంట్యాడ

డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడడం ప్రమాదకరమని, అయితే ఈ వాచ్‌లు ఉంటే ఇబ్బంది లేకుండా మాట్లాడుకుంటూ సాఫీగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో వాచ్‌లు రూ.500 నుంచి రూ.లక్ష వరకూ లభిస్తున్నాయి. మనం చేసే రోజు వారీ పనులను కూడా ఈ వాచ్‌లోనే నిక్షిప్తం చేసుకునే వెసులుబాటు కూడా ఉండడం విశేషం.

అధునాతన ఫీచర్లు.. ఆకట్టుకుంటున్న డిజైన్లు

స్మార్ట్ వాచ్‌ల్లో అధునాతన ఫీచర్లు ఉన్నాయి. సిమ్ కార్డ్, కెమెరా ఆప్షన్లు ఉంటున్నాయి. మండలంలో సెల్ ఫోన్లు విక్రయించే ప్రతి దుకాణంలోనూ స్మార్ట్ ఫోన్లను అందుబాటులో ఉంచారు. సుమారు 60 వరకు ఉన్న దుకాణాల్లో వీటిని విక్రయిస్తున్నారు. ఒక్కో దుకాణంలో ప్రతి రోజూ మూడు నుంచి నాలుగు వరకూ స్మార్ట్ వాచ్‌లు విక్రయిస్తున్నారు.

బ్లూటూత్ ఆప్షన్..

స్మార్ట్ వాచ్‌ల్లో బ్లూటూత్ ఆప్షన్ ఉంటుంది. ఈ బ్లూటూత్ ద్వారా మొబైల్ నుంచి వాచ్‌కు కనెక్ట్ చేసుకుంటున్నారు. ఈ వాచ్‌ను ఉపయోగించి ఫోన్ కాల్స్‌ను రిసీవ్ చేసుకోవడంతో పాటు అందులో నుంచే డయల్ చేయడంతో పాటు మెసేజ్‌లు కూడా పంపించే వెసులుబాటు ఉంది. సోషల్ మీడియా నోటిఫికేషన్లు కూడా వాచ్‌లో అందుబాటులో ఉన్నాయి.

స్మార్ట్ వాచ్‌లోనే కార్యాచరణ

స్మార్ట్ వాచ్‌లు ఉంటే మన దినసరి కార్యాచరణ, నిద్ర, మంచి నీరు తాగడం, ఎక్కువ సేపు కూర్చుని వెంటనే వెంటనే నిలబడాలని స్మార్ట్ వాచ్ సూచించడం విశేషం. దీని వల్ల మనిషి ఏ సమయంలో ఏం చేయాలనే టైం టేబుల్ మాదిరిగా అప్రమత్తం చేస్తుంది. అలాగే వాచ్‌లో ఉన్న కొన్ని ఫీచర్లు మన శరీర ఉష్ణోగ్రత, హార్ట్‌బీట్‌ను తెలియజేస్తోంది.



ఫిట్‌నెస్ లక్ష్యాల కోసం..

మెరుగైన వ్యాయామం చేసేందుకు స్మార్ట్ వాచ్‌లు దోహదం చేస్తున్నాయి. ఫిట్‌నెస్ లక్ష్యాలను పర్యవేక్షించడం, ట్రాక్ చేయడానికి ఉపయోగపడుతున్నాయి. హార్ట్‌బీట్ నోటిఫికేషన్‌ను వ్యాయమ సమయంలో సూచిస్తోంది. అలాగే ప్రతి రోజు మనం ఎన్ని క్యాలరీలు శక్తిని ఖర్చు చేస్తున్నామో కూడా ఈ వాచ్ నివేదిక అందిస్తుంది.

పనులన్నీ స్మార్ట్‌గానే..



స్మార్ట్ వాచ్‌తో టైం టేబుల్‌ను సెట్ చేసుకుంటున్నాను. దానికి అనుగుణంగా ఆయా పనులకు ఆయా సమయాన్ని కేటాయిస్తున్నాను. సకాలంలో పనులు చేసుకోవడానికి ఈ స్మార్ట్ వాచ్ దోహదం చేస్తోంది. ఇది నాకు చాలా ఉపయోగకరంగా ఉంది..

– కె ప్రత్యూష, సీఏ విద్యార్థి, కొత్తకర్ణవానిపాలెం

ఎంతో ఉపయోగం



స్మార్ట్ వాచ్‌తో ఎంతో ఉపయోగం. ప్రతి రోజు నేను ఎన్ని అడుగులు వేస్తున్నాను, ఎన్ని క్యాలరీలు ఖర్చు చేస్తున్నానో ఈ వాచ్‌లో తెలుస్తుంది. చాలా ఉపయోగకరంగా ఉంది.

– వి యామినిరావు, డిగ్రీ విద్యార్థి, వుడాకాలనీ, పెదగంట్యాడ

బిడ్డకు తల్లిపాలు దివ్య ఔషధం



తల్లిపాల గురించి బాలింతలకు, గర్భిణులకు వివరిస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న టీచర్ కృష్ణవేణి

డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా

పెదగంట్యాడ: పుట్టిన బిడ్డకు తల్లిపాలు దివ్య ఔషధంలా పని చేస్తాయని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం దేవాడ పీహెచ్‌సీ ఆవరణలో తల్లులు, బాలింతలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బందికి తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, సిబ్బంది అన్నపూర్ణ, ఎం శ్రీనివాసరావు, ఆర్ రమణమ్మ పాల్గొన్నారు.

- తల్లిపాలు పుట్టిన బిడ్డకు శ్రేయస్కరమని అంగన్‌వాడీ టీచర్ కృష్ణవేణి తెలిపారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి ప్రియదర్శిని కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా బాలింతలు, గర్భిణులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలను తాగించాలన్నారు. అంగన్‌వాడీల కార్యకర్తలు పీబీ కళావతి, ఎంపీ లక్ష్మి, కుమారి, వి. సావిత్రి, బి. పద్మావతి, కె. సత్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ వామపక్షాల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

గాజువాక: అదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం, సీపీఐ నాయకులు గాజువాకలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. పాతగాజువాకలో ప్రారంభమైన ర్యాలీ గాజువాక మెయిన్ రోడ్‌లో సినిమా హాల్ జంక్షన్ మీదుగా కొత్త గాజువాక వరకు కొనసాగింది. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ అదానీ స్మార్ట్ మీటర్ల వల్ల కరెంటు బిల్లు ఎక్కువ మొత్తంలో వస్తుందన్నారు. స్మార్ట్ మీటర్ ధర సింగిల్ ఫేజ్ అయితే రూ.9వేలు, త్రీఫేజ్ అయితే రూ.19వేలు వినియోగదారుడి నుంచి వసూలు చేస్తారన్నారు. ఈ మీటర్లతో ఉపయోగించే విద్యుత్‌కు ఉదయం ఒక రేటు, సాయంత్రం పీక్ అవర్ పేరుతో మరో రేటు వసూలు చేస్తారన్నారు. విద్యుత్‌ను అదానీ అనే ప్రైవేట్ వ్యక్తికి అప్పగించడం దారుణమన్నారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ ఆస్తులను ఆయనకు అప్పగించారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఒకమాట, అధికారం లేనప్పుడు మరో మాట మాట్లాడడం కూటమి నేతలకు తగదన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ప్రభుత్వం కూడా ఈ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతమవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.లోకేష్, పద్మ, కె.సంతోషం, పి.యశోదరాణి, బి.అప్పారావు, డి.అప్పారావు, కె.అవతారం తదితరులు పాల్గొన్నారు.

యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటుకు చర్యలు



కార్యక్రమంలో వీసీ ఆచార్య రాజశేఖర్ తదితరులు

మద్దిలపాలెం : పోటీ ప్రపంచంలో విజేతగా మారాలంటే విద్యా సంబంధిత అంశాల్లో రాజీ పడొద్దని... ప్రతిభ చూపాల్సిన అవసరం ఉందని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ఇంజినీరింగ్ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు భవిష్యత్‌లో పరిశోధన రంగంలో రాణించే దిశగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేకంగా యూజీ రీసెర్చ్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థులు నాలుగేళ్ల తర్వాత తాము పొందాలనుకునే భవిష్యత్ కోసం ప్రణాళిక తయారు చేసుకుని నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా నూతన కరికులం తయారుచేసి అమలు చేస్తున్నామని చెప్పారు. అదే సమయంలో విద్యార్థులను తల్లిదండ్రులు నిరంతరం పరిశీలించాలని సూచించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ 8 వేల మంది విద్యార్థులతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల దేశంలోనే అత్యుత్తమ కళాశాలల్లో ఒకటిగా నిలుస్తోందని చెప్పారు. 14 బీటెక్ కోర్సులను, 27 ఎంటెక్ కోర్సులను 17 విభాగాల ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ర్యాగింగ్ రహితంగా ఇంజినీరింగ్ కళాశాలను తీర్చిదిద్దామని వివరించారు. మెరుగైన ఉపాధి అవకాశాలతోపాటు, స్టార్టప్, విదేశాల్లో ఉన్నత విద్యకు తమ విద్యార్థులు వెళ్లడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా జరిపారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు.

క్రీడాకారులకు టీషర్ట్స్ వితరణ



క్రీడాకారులతో బట్టు పైడిరెడ్డి

పెదగంట్యాడ: క్రికెట్ పోటీల్లో క్రీడాకారులు విజయాలు సాధించాలని బీపీఆర్ స్టార్స్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు,77వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్టు పైడిరెడ్డి ఆకాంక్షించారు. పిట్టవానిపాలెంలో ఎవరి ప్రోత్సాహం లేకుండా క్రికెట్ శిక్షణ పొందుతూ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలకు హాజరై విజయాలు సాధిస్తున్న క్రీడాకారులకు సోమవారం బట్టు పైడిరెడ్డి టీ షర్ట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. క్రీడాకారులకు తమవంతు సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో క్రీడాకారులు విజయ్, అప్పలరెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మరో నిందితుడి అరెస్టు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద మొల్లి సంతోష్‌కుమార్‌పై జరిగిన దాడి కేసులో మరో నిందితుడిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 25న కొంత మంది సంతోష్‌కుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆ దాడిలో పాల్గొన్న వారిలో 11 మందిని ఇప్పటికే అదుపులో తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. సోమవారం ఈ కేసులో ఏ14 వడ్డి శ్రీరామ్‌ను పోలీసులు అదుపులోకి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తూ రాత్రి వేళల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఆదివారం అర్ధరాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టీటీఈ రెస్ట్ హౌస్, బుకింగ్ కార్యాలయంతోపాటు హెరిటేజ్ రిటైరింగ్ రూంలు, స్లీపింగ్ పాడ్స్ వంటి ప్రాంతాల్లో సిబ్బంది వసతులు, ప్రమాణాలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో సిబ్బందితో డీఆర్‌ఎం ముఖాముఖి మాట్లాడారు. ఏ సమస్యలున్నా తనకు తెలియజేయాలని, అవసరమైన సూచనలు చేయవచ్చన్నారు. ఆకస్మిక తనిఖీల వల్ల వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని డీఆర్‌ఎం తెలిపారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు చర్యలు

- వాల్తేర్ డివిజన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం



రైల్వే మహిళా గ్యాంగ్‌కు భద్రతపై అవగాహన కల్పిస్తున్న టీం సభ్యులు

తాటిచెట్లపాలెం: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులకు భద్రతతో కూడిన గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు వాల్తేర్ డివిజన్ సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ప్రారంభించింది. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారీల నేతృత్వంలో ఈ బృందం సిబ్బందిపై లైంగిక వేధింపులు, హక్కులు, విధుల గురించి అవగాహన కల్పిస్తారు. మహిళా ఉద్యోగులకు ఎటువంటి భయం, ఆందోళన లేకుండా చేయడమే వాల్తేర్ డివిజన్ లక్ష్యమని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నాలుగు నిబద్ధత గల కమిటీలు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇవి డివిజన్ పరిధిలోని ఆయా రైల్వే స్టేషన్లు, పనిచేసే ప్రదేశాల్లో పర్యటించి మహిళా ఉద్యోగులకు వారి విధుల్లో ఎదురయ్యే లైంగిక వేధింపులపై పలు కీలక సూత్రాలను తెలియజేస్తారన్నారు.

శభాష్.. పోలీస్

- రక్తదానం అభిరుచిగా మార్చుకున్న పోలీస్ కానిస్టేబుల్
- 28 సార్లు రక్తదానం



రక్తదానం చేస్తున్న నానాజీ



సత్యసాయి భజన మండలి ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్ అందుకుంటూ..

అగనంపూడి: చేసేది పోలీస్ ఉద్యోగం... ఆయనకు రక్తదానం జీవితంలో ఒక భాగమైపోయింది. ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఉన్నప్పుడు సర్టిఫికెట్ కోసం ఆరంభించిన రక్తదానం కరోనా మూడేళ్లు మినహా కొనసాగుతూ ఉంది. క్రమం తప్పకుండా ఏడాదికి రెండు నుంచి మూడు సార్లు చేస్తూ రక్తదానం చేస్తూ అధికారుల మన్ననలు పొందుతున్నారు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రొంగలి నానాజీ.

2009లో ఆరంభం

2009లో ఏఎంఏఎల్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్‌గా ఉండగా రోటరీ క్లబ్ సర్టిఫికెట్ కోసం రక్తదానం చేశారు. తర్వాత 2010లో కానిస్టేబుల్ శిక్షణ సమయంలో ఆపదలో ఉన్న వారికి ప్రాణదానంతో సమానమైన రక్తదానం విశిష్టత, ప్రాధాన్యం తెలుసుకున్నారు. నాటి నుంచి ఏడాదికి రెండు నుంచి మూడుసార్లు రక్తదానం చేస్తూ వస్తున్నారు. కరోనా మూడేళ్లు మినహా ఆయన రక్తదాన ప్రయాణం కొనసాగిస్తూ 28 సార్లు రక్తదానం చేశారు. అగనంపూడిలో నివాసముంటున్న నానాజీ ఆదివారం ఉక్కునగరం, అగనంపూడి సత్యసాయి భజన మండళ్ల ఆధ్వర్యంలో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి నిర్వహించిన రక్తదాన శిబిరంలో 28వ సారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి భజన మండలి ప్రతినిధులు ఆయన్ను అభినందించారు.

పోలీస్ అమరవీరుల దినోత్సవం రోజు తప్పనిసరిగా..



ఏటా పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదానం చేయడంతో పాటు మరో రెండు మార్లు రక్తదానం చేస్తున్నాను. రక్తదానం వల్ల ఆరోగ్యంతో పాటు ఆనందం, సంతోషం కలుగుతుంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకొనే శక్తి భగవంతుడు నాకు ఇచ్చాడని భావిస్తున్నాను. అవకాశం ఉన్నంత వరకు ఏటా మూడు సార్లు రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్నాను.

– రొంగలి నానాజీ, కానిస్టేబుల్

ఫార్మా బస్సుల హాల్ట్‌లను కుదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్

గాజువాక: ఫార్మా బస్సుల వల్ల గాజువాకలో ట్రాఫిక్ సమస్యలు పెరిగిపోతున్నాయని ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఫార్మా బస్సుల యజమానులతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులను ఎక్కించుకోవడం కోసం బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపేస్తున్నారన్నారు. దీనివల్ల జనం ఇబ్బంది పడుతున్నారన్నారు. బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బస్సులు నిలిపే హాల్ట్‌లను తగ్గించుకోవాలన్నారు. పార్కింగ్ లేనిచోట బస్సులు ఆపితే చర్యలు తీసుకుంటామన్నారు. షిఫ్ట్‌ల సమయాలను కూడా క్రమబద్ధీకరించుకోవాలన్నారు. బస్సులన్నీ ఒకేసారి రాకపోకలు సాగించడం వల్ల రోడ్డుపై మిగిలిన వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. ఒక్కో బస్సుకు కొంత గ్యాప్ ఉండే విధంగా షిఫ్ట్‌లను మార్చుకొని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సహకరించాలన్నారు. సమావేశంలో గాజువాక ట్రాఫిక్ సీఐ కోటేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిల పాఠశాల భవనం పరిశీలన

తొలగించడానికి చర్యలు చేపట్టాలని ఆదేశం



శిథిల భవనాన్ని సందర్శించి పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న పీఈవో సునీత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీలోని మండల పరిషత్ పాఠశాల ఆవరణలోని శిథిల భవనాన్ని పరిషత్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (పీఈవో) ఎం.సునీత సోమవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ శిథిల భవనం విషయాన్ని తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. భవన పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నందున వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కొరాయి జగదీష్, గంతకోరు సత్యవతి, పాఠశాల హెచ్‌ఎం దుంగల ఇందిరా ప్రియదర్శిని, కమిటీ చైర్మన్ రాంబాబు, నెల్లి సంతోషి, శ్యామలక్ష్మి పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్..

అగనంపూడి: అగనంపూడి పశువైద్యశాల నూతన భవన నిర్మాణానికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని, నిధులు మంజూరైన వెంటనే నిర్మాణం చేపడతామని అగనంపూడి పశువైద్యాధికారి లావణ్య తెలిపారు. అగనంపూడిలోని పశువుల ఆస్పత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో తలెత్తుతున్న ఇబ్బందులపై సోమవారం ‘సాక్షి’ దినపత్రికలో మూగనోము శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. 2023 లో 17 సెంట్ల భూమి కేటాయించారని పేర్కొన్నారు. నూతన భవనం కోసం ప్రజా సంఘాలు వినతులు అందించాయని, వారితో పాటు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారని ఆమె తెలిపారు. అనుమతులు వస్తే నూతన భవనం నిర్మిస్తామని పేర్కొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గాజువాక

9912222749, 9705347420, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com